క్లుప్తంగా

సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న అస్కాబ్ అధికారిణి సౌమ్య

సంజామల: ప్రాథమిక సహకార సంఘం సేవలు రైతులు సద్వినియోగం చేసుకోవాలని అస్కాబ్ అధికారిణి సౌమ్య సూచించారు. మండల పరిధిలోని ఆకుమల్ల ప్రాథమిక సహకార సంఘం అధ్యక్షుడు గౌరిగారి నాగేశ్వర్ రెడ్డి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన ఆర్థిక, సాంకేతిక అక్షరాస్యత అవగాహన సదస్సులో సౌమ్య మాట్లాడారు. రైతులు సొసైటీలో వచ్చే రుణాలు, సబ్సిడీ తదితర సేవలు వినియోగించుకోలన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ అమర్‌నాథ్‌రెడ్డి, సూపర్‌వైజర్ మహేశ్వర్ రెడ్డి, సీఈఓ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

గడ్డివాములు దగ్ధం



బాధిత రైతులతో మాట్లాడుతున్న రాష్ట్ర గిడ్డంగుల శాఖ డైరెక్టర్ బాబుల్‌రెడ్డి

బేతంచెర్ల: మండల పరిధిలోని పాపసాని కొట్టాల గ్రామంలో ఎద్దుల నరసింహారెడ్డి, పాపసాని ఎల్లనాగిరెడ్డి, పాపసాని ఈశ్వర్‌రెడ్డి గడ్డివాములకు శుక్రవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. గ్రామస్తులు గమనించి మంటలు ఆర్పేందుకు ప్రయత్నించినా అదుపుకాకపోవడంతో బనగానపల్లె ఫైరింజన్‌కు సమాచారం ఇచ్చారు. వారు అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అప్పటికే 5 గడ్డివాములు దగ్ధమయ్యాయి. దాదాపు రూ.2లక్షల మేర ఆస్తి నష్టం జరిగిందని బాధిత రైతులు తెలిపారు. రాష్ట్ర గిడ్డంగుల శాఖ డైరెక్టర్ బాబుల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తిరుమలేశ్వర్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని బాధిత రైతులను పరామర్శించి, నష్ట పరిహారం అందేలా చూస్తామని తెలిపారు.

ఆసుపత్రికి వెళ్లి పింఛన్ అందజేత



ఎల్లయ్యకు పింఛన్‌ను అందజేస్తున్న వలంటీర్ ఇండ్ల పద్మ

డోన్: పట్టణంలో సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం కొనసాగుతోంది. శుక్రవారం పట్టణంలోని కొండపేట 40వ సచివాలయం పరిధిలో నివసిస్తూ అనారోగ్య కారణాల వల్ల కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న హోటల్ ఎల్లయ్యకు వలంటీర్ ఇండ్ల పద్మ ఆసుపత్రికి వెళ్లి పింఛన్ మొత్తాన్ని అందజేశారు.

98 శాతం పింఛన్ల పంపిణీ

బనగానపల్లె: మండలంలో 98 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేసినట్లు ఎంపీడీఓ శివరామయ్య శుక్రవారం తెలిపారు. మండలంలో 12,844 పింఛన్లు ఉండగా 12,587 మంది లబ్ధిదారులకు పంపిణీ చేసినట్లు తెలిపారు. రెండు రోజుల్లో 100 శాతం పూర్తి చేస్తామన్నారు.

తాగునీటి సరఫరాకు అంతరాయం

డోన్ టౌన్: పట్టణానికి తాగునీటిని సరఫరా చేసే గాజులదిన్నె ప్రాజెక్టు పైపులైను లీకేజ్ కారణంగా రెండు రోజుల పాటు తాగు నీరు సరఫరా ఉండదని మున్సిపల్ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గాజులదిన్నె ప్రాజెక్టు పైపులైన్‌కు కోటకొండ సమీపంలో లీకేజ్ కారణంగా యుద్ధ ప్రాదిపదికన మరమతులు చేస్తున్నట్లు తెలిపారు. శని, ఆదివారాల్లో రెండు రోజుల పాటు తాగునీటి సరఫరా ఉండదని, విషయాన్ని గ్రహించి నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. తిరిగి సోమవారం తాగునీరు సరఫరాను పునరుద్ధరిస్తామన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

బేతంచెర్ల: మండల పరిధిలోని సీతారామాపురం మెట్టవద్ద గుర్తుతెలియని, మానసిక స్థితి సరిగా లేని 40 ఏళ్ల వ్యక్తి విగతజీవిగా పడ ఉండటంతో రహదారి నిర్మాణ పనులు చేస్తున్న వారు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించగా ఎలాంటి ఆధారాలు లభ్యం కాకపోవడంతో గుర్తు తెలియని శవంగా నిర్ధారించారు. మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించాలని ఆ నలుగురు స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు వన్నూర్ బాషాను కోరారు. ఆయన సంస్థ సభ్యులు లక్ష్మి రాఘవ, యూసుఫ్, నాగేశ్వర్‌రెడ్డి, అక్బర్, సద్దాం, మా బాషాతో కలిసి అనాథ శవాన్ని శ్మశానానికి తరలించి అంత్యక్రియలు నిర్వహించారు.

ప్రభుత్వ పాఠశాలలో చోరీ

డోన్ టౌన్: స్థానిక నెహ్రూనగర్ ప్రభుత్వ పాఠశాలలో గురువారం రాత్రి గుర్తుతెలియని దుండగులు రెండు ఫ్యాన్లు, ట్యాబ్ చోరీ చేశారు. ఉదయం పాఠశాలకు చేరుకున్న హెచ్ ఎం శ్రీనివాసుల గమనించి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. కాలనీలోని సీసీ ఫుటేజీలను పరిశీలించగా శ్రీరాంనగర్‌కు చెందిన ఓ మైనర్, వైఎస్ నగర్‌కు చెందిన మైనర్ కలిసి చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. ఇద్దరిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. మైనర్లను కోర్టులో హాజరు పరచగా జడ్జి కర్నూలు జువైనల్ హోంకు తరలించాలని ఆదేశించినట్లు పట్టణ పోలీసులు తెలిపారు.

ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు

- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి
- టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన 40 కుటుంబాలు



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి,



ధోబీఘాట్‌కు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని చిత్రంలో జెడ్పీ చైర్మన్

కొలిమిగుండ్ల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుల, మత, పార్టీలకు అతీతంగా అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు అందజేస్తున్నారని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. శుక్రవారం కొలిమిగుండ్లలోని పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు పేరం సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో టీడీపీకి చెందిన పాణ్యం సుబ్బరాయుడు, సురేష్, నరేష్, ఇటిక్యాల ఓబులేసు, నరసింహ, వెల్డింగ్ రాజు, బొంబాయి టైలర్ సూర్యనారాయణరెడ్డితో పాటు రజకులు, యాదవులు, ఇతరులు కలిపి 40 కుటుంబాలకు పైగా వైఎస్సార్‌సీపీలో చేరాయి. వారికి ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తుండటంతో టీడీపీ నాయకులకు ప్రజలపై ఎక్కడ లేని ప్రేమ కనబరుస్తున్నారన్నారు. అలాంటి వారి మాటలను నమ్మొద్దని సూచించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హత ఆధారంగా అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చి జగనన్న కాలనీలు ఏర్పాటు చేయడంతో ఊర్లు వెలుస్తున్నాయన్నారు. మండల అభివృద్ధి టీడీపీ హయాంలో ఎక్కువ జరిగిందా? జగనన్న పాలనలో ఎక్కువ జరిగిందా అనేది బేరీజు వేసుకుని వచ్చే ఎన్నికల్లో మంచి చేసిన ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలన్నారు.

ధోబీఘాట్‌కు భూమి పూజ

నాయినపల్లె రోడ్డు సమీపంలో రజకుల కోసం రూ.10 లక్షలతో ధోబీఘాట్‌కు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి భూమి పూజ చేశారు. శరవేగంగా నిర్మాణ పనులు పూర్తి చేసి ధోబీఘాట్‌ను వాడుకులోకి తీసుకొస్తామని హామీ ఇచ్చారు. తమకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని రజకులు ఎమ్మెల్యే కాటసాని దృష్టికి తీసుకురాగా పరిశీలించి అర్హులందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు లాయర్ మహేశ్వర రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పేరం సూర్యనారాయణరెడ్డి, నందకిషోర్‌రెడ్డి, బీగాల వెంకటసుబ్బయ్య, ఎంకె నాయుడు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా సొమ్ము అందజేత

కోవెలకుంట్ల: మండలంలోని అమడాల గ్రామానికి చెందిన మద్దిలేటి గత నెల 18న రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మృతుడు వైఎస్సార్‌బీమా పాలసీదారుడు కావడంతో అతని కుటుంబానికి ప్రమాద బీమా వర్తించింది. శుక్రవారం సర్పంచ్ బాలమద్దిలేటి, ఉపసర్పంచ్ మనోహర్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు శంకరయ్య, వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో నామినీగా ఉన్న మృతుని భార్య పుల్లమ్మకు తక్షణ సాయంగా రూ.10 వేలు అందజేశారు. మిగిలిన రూ.4.90 లక్షలు నామినీ ఖాతాలో జమ అవుతుందని సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ సుబహాన్ తెలిపారు.

పోలీసుల అదుపులో నిందితుడు

అవుకు: మండల పరిధిలోని గుండ్ల శింగవరం గ్రామంలో గత గురువారం ఓ వ్యక్తిపై హత్యాయత్నం జరిగిన విషయం విదితమే. ఈ ఘటనకు సంబంధించిన నిందితున్ని శుక్రవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు ఇంచార్జ్ ఎస్‌ఐ తిరుపాలు తెలిపారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



వైఎస్సార్‌సీపీలోకి చేరిన టీడీపీ కార్యకర్తలు

ప్యాపిలి: మండల పరిధిలోని నేరేడుచెర్ల గ్రామానికి చెందిన 20 టీడీపీ కుటుంబాలు శుక్రవారం వైఎస్సార్‌సీపీలోకి చేరాయి. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో కంబగిరి రాముడు, గుట్టలపల్లి బాలు, తాతయ్య, వెంకటరాముడు, తదితర 20 కుటుంబాలు.. సర్పంచ్ అనిల్ కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు నేరేడుచెర్ల చంద్రశేఖర్ రెడ్డి, వెంకటేశ్వర్లు తదితరుల ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలోకి చేరాయి. జెడ్పీటీసీ సభ్యుడు బోరెడ్డి శ్రీరామిరెడ్డి, వ్యవసాయల సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ బొర్రా మల్లికార్జునరెడ్డి, ప్యాపిలి ఉప సర్పంచ్ గడ్డం భువనేశ్వర్ రెడ్డి తదితరులు వారికి వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి పోరాటం

కోవెలకుంట్ల: విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం రాజీలేని పోరాటం చేస్తోందని యూనియన్ మండల అధ్యక్షురాలు కృష్ణవేణి అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ సంఘం ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏపీయూస్ ఏర్పడినప్పటి నుంచి ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై ఎన్నో ఉద్యమాలు చేసి పరిష్కారానికి కృషి చేసిందన్నారు. పాఠశాల హెచ్‌ఎం రాజయ్య, యూనియన్ నాయకులు శ్రీపతి, మల్లికార్జున, నాగేశుడు, తిరుపతిరెడ్డి, శివశంకర్‌రెడ్డి, సుగుణ, సుమ, జహిరాబీ, వెంటేశ్వర్లు, వెంకటేశ్వరరెడ్డి, ఓబులేసు, సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ

అవుకు: మండల పరిధిలోని సుంకేసులలో పొలానికి నీరు పారించుకునే విషయంలో రెండు వర్గాల మధ్య శుక్రవారం రాత్రి ఘర్షణ జరిగింది. మధుసూదన్, మదనశేఖర్‌లు కౌలుకు తీసుకున్న భూమిలో సాగు చేసిన మిరప పైరుకు నీరు పారించుకునే విషయంలో నారాయణస్వామి, వంశీ, నాగభాస్కర్‌లతో వివాదం చోటుచేసుకుంది. కొడవలి, గొడ్డలితో మధుసూదన్, మదనశేఖర్‌లపై దాడి చేయటంతో వారికి రక్తగాయాలయ్యాయి. బాధితులను చికిత్స నిమిత్తం అవుకు ఆసుపత్రికి తరలించారు. సీఐ తిమ్మారెడ్డి, ఇన్‌చార్జ్ ఎస్‌ఐ తిరుపాలు బాధితులతో మాట్లాడి వివరాలను సేకరించారు.

వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలి



వివేకానంద విగ్రహానికి పూల మాలలు వేస్తున్న దృశ్యం

డోన్ టౌన్: స్వామి వివేకానందను యువత ఆదర్శంగా తీసుకోవాలని వివేకానంద స్ఫూర్తి సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మలిశెట్టి జగన్‌మోహన్, అధ్యక్ష, కార్యదర్శులు న్యాయవాదులు నాగభూషణంరెడ్డి, జొన్నలగడ్డ శ్రీనివాసులశెట్టి అన్నారు. స్థానిక ఎల్‌ఐసీ కార్యాలయం సమీపంలోని వివేకానంద విగ్రహానికి శుక్రవారం వారు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన గురుకుల పాఠశాల 10వ తరగతి విద్యార్థిని రూపశ్రీకి వాచ్ బహుమతిగా అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు రంగయ్య, సురేష్, ఏవీ రావ్, శాంతిప్రియ, కుళ్లాయప్ప, తొగటు రేష్‌బాబు, చిన్నపరెడ్డి, శ్రీనివాసులు, శాంతి తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు ఘన సన్మానం



తహసీల్దార్ పుష్పకుమారిని సత్కరిస్తున్న అధికారులు

కోవెలకుంట్ల: త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో చిత్తూరు జిల్లాకు బదిలీ అయిన కోవెలకుంట్ల తహసీల్దార్ పుష్పకుమారిని శుక్రవారం పలువురు ఘనంగా సన్మానించారు. తహసీల్దార్ చిత్తూరు జిల్లాలోని కార్వేటినగర్‌కు బదిలీ కాగా స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో కార్యాలయ సిబ్బంది, వీఆర్‌ఓలు పూలమాలలతో సత్కరించి వీడ్కోలు పలికారు. అలాగే మేజర్ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ మెట్ల సరళ, ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి, ఈఓ గోపినాథ్ ఆధ్వర్యంలో సన్మానం చేశారు.

భక్తిశ్రద్ధలతో చౌడేశ్వరిదేవి పల్లకీ సేవ



పల్లకీ సేవ నిర్వహిస్తున్న దృశ్యం

బనగానపల్లె రూరల్: మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన చౌడేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారికి పల్లకీ సేవ కార్యక్రమం శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం ఈఓ రామానుజన్, అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమార్చన, అభిషేకం తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో ఉంచి సేవా కార్యక్రమాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు.

గోదుమారి ఎల్లమ్మకు బోనాలు



గోదుమారి ఎల్లమ్మకు బోనాలతో వస్తున్న భక్తులు, (ఇన్‌సెట్)ప్రత్యేక అలంకరణలో గోదుమారి ఎల్లమ్మ

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్‌ఎస్ రంగాపురం గ్రామ సమీపంలో వెలసిన గోదుమారి ఎల్లమ్మకు శుక్రవారం గ్రామస్తులు బోనాలు సమర్పించారు. యువకులు, పెద్దలు సామూహికంగా బోనాలతో ఊరేగింపుగా బయలు దేరి ముచ్చట్ల వాగులో కొలువైన గోదుమారి ఎల్లమ్మకు సమర్పించి, భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. గ్రామం సుభిక్షంగా ఉండాలనే అమ్మవారికి బోనాలు సమర్పించినట్లు గ్రామస్తులు తెలిపారు.

ఆర్టీసీ సిబ్బందికి వైద్య పరీక్షలు

డోన్ టౌన్: ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చడానికి సిబ్బంది ఆరోగ్యంగా ఉండే విధంగా చూసుకోవాలని డిపో మేనేజర్ శశిభూషణ్ సూచించారు. స్థానిక ఆర్టీసీ డిపో గ్యారేజీలో శుక్రవారం శ్రీవాణి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డ్రైవర్లకు, సిబ్బందికి బీపీ, షుగర్ తదితర వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ హరీష్, ఆసుపత్రి కోర్డినేటర్ నాగరాజు పాల్గొన్నారు.


డీటీకి సన్మానం



డోన్ టౌన్: గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ అధికారిగా ప్రశంసా పత్రం అందుకున్న డిప్యూటీ తహశీల్దార్ మధును శుక్రవారం సమగ్ర వినియోగదారుల రక్షణ సంఘం అధ్యక్షులు నాగరాజు ఆధ్వర్యంలో సత్కరించారు.

సురక్ష శిబిరానికి విశేష స్పందన

- 521 మందికి వైద్య పరీక్షలు



కోవెలకుంట్లలో ఓపీ నమోదు చేసుకుంటున్న ప్రజలు



మందులు అందజేస్తున్న ఆరోగ్య సిబ్బంది

కోవెలకుంట్ల: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి విశేష స్పందన లభిస్తోంది. శుక్రవారం పట్టణంలోని నాల్గవ గ్రామ సచివాలయ పరిధిలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష రెండవ వైద్య శిబిరానికి 521 మంది హాజరై వైద్య సేవలు పొందారు. వైద్య శిబిరంలో 306 మంది మహిళలు, 215 మంది పురుషులకు డాక్టర్లు సుప్రియ, హరికృష్ణ, రాబర్ట్‌కెన్నేడి, కంటి వైద్యనిపుణుడు గంగాధర్ వైద్య పరీక్షలు చేశారు. ఇందులో 27 మంది చిన్నపిల్లలు, 18 మంది గర్భిణులు, 67 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. గతంలో కంటి పరీక్షలు నిర్వహించిన 36 మందికి కంటి అద్దాలు అందజేశారు. మేజర్ పంచాయతీ సర్పంచ్ మెట్ల సరళ, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ బీవీ నాగార్జునరెడ్డి హాజరై విద్య శిబిరాన్ని పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి, ఈఓపీఆర్‌డీ రాధిక, ఈఓ గోపినాథ్, వైఎస్సార్‌సీపీ నాయకులు చిక్కేపల్లి ప్రసాదరెడ్డి, సుధాకర్‌రెడ్డి, గజ్జెలరెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్లు మునిస్వామి, వీరభద్రుడు పాల్గొన్నారు.

కొలిమిగుండ్లలో..

కొలిమిగుండ్ల: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. వైద్యులు హరిచరణ్‌రెడ్డి, కల్యాణ్‌తో పాటు పలువురు వైద్యులు సాధారణ వైద్య పరీక్షలు, బీపీ, షుగర్, కంటి పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. 482 మంది వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకున్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వైద్య శిబిరాలకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందని ఎంపీడీఓ సాయికృష్ణ అన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశాకార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

సంజామలలో..



కానాలలో మహిళలకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

సంజామల: మండల పరిధిలోని కానాల సచివాలయ ఆవరణంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు చంద్రశేఖర్ రెడ్డి, శ్రీకాంత్, మేఘన హాజరై 511 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నాగకుమార్, పంచాయతీ కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అయ్యో.. సుబ్బారెడ్డి!

డోన్: ధర్మారం సుబ్బారెడ్డి పరిస్థితి అయ్యో పాపం అనేలా తయారైంది. ఆయన అభ్యర్థిత్వాన్ని రెండు నెలలుగా కోట్ల, కేఈ వర్గీయులు బాహాటంగా వ్యతిరేకిస్తూ వచ్చారు. ఆయనే కనుక ఎమ్మెల్యే అభ్యర్థి అయితే ఓడించి తీరుతామని బహిరంగ ప్రకటన చేశారు. శుక్రవారం ఉదయం కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అభ్యర్థిత్వాన్ని పార్టీ ఖరారు చేసిందని వార్తలు రావడంతో సుబ్బారెడ్డి వర్గం డీలా పడిపోయింది. మరోపక్క కోట్ల, కేఈ వర్గాలు సోషల్ మీడియాలో పలు పోస్టులు పెట్టారు. దీంతో సుబ్బారెడ్డి తీవ్ర ఒత్తిడికి లోనయ్యారు. సీటు విషయమై అమీతుమీ తేల్చుకునేందుకు సుబ్బారెడ్డి విజయవాడకు బయలుదేరి వెళ్లారు. ఆయన వర్గీయులు మాత్రం సీటు మనదేనంటూ, అధైర్యపడవద్దంటూ సోషల్ మీడియాలో పోస్టింగ్‌లు పెట్టారు. సాయంత్రం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా ధర్మారం సుబ్బారెడ్డిని తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబు నాయుడు మరోసారి ప్రకటించాడని హంగామా చేశారు. రాత్రి పాత బస్టాండ్‌లో బాణాసంచా కాల్చుతూ ర్యాలీలు, బైక్ రైడింగ్‌లులతో హోరెత్తించారు. ప్రజా జీవనానికి ఆటంకం కలగడంతో అనుమతి లేకుండా ర్యాలీలు నిర్వహించిన విషయమై విచారించి చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

ఆడుదాం ఆంధ్రా రాష్ట్రస్థాయి పోటీలకు ప్యాపిలి జట్టు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన ప్యాపిలి జట్టు



క్రికెట్ జట్టు సభ్యులతో మున్సిపల్ చైర్మన్ రాజేష్

ప్యాపిలి: గ్రామీణ క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు క్రీడాకారులకు వరంగా మారాయి. ప్యాపిలి నాలుగో సచివాలయ పరిధిలోని జట్టు అంచెలంచెలుగా విజేతగా నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికైంది. మండల స్థాయిలో 22 జట్లతో తలపడి విజేతగా నిలిచిన ప్యాపిలి జట్టు డివిజన్ స్థాయికి ఎంపికైంది. డివిజన్ స్థాయిలో బేతంచెర్ల, డోన్ జట్లతో తలపడి విజేతగా నిలిచి జిల్లా స్థాయికి ఎంపికైంది. జిల్లా స్థాయిలోనూ నందికొట్కూరు, శ్రీశైలం, బనగానపల్లె, నంద్యాల, ఆళ్లగడ్డ తదితర జట్లతో తలపడి డోన్ డివిజన్ తరపున విజేతగా నిలిచింది. దీంతో ఈ నెల 5 నుంచి 10 వ తేదీ వరకు విశాఖపట్టణంలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది.

క్రికెట్ విభాగంలో డోన్ విద్యార్థినుల జట్టు

డోన్: ఈనెల 6న విశాఖపట్నంలో జరగనున్న రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు డోన్ సచివాలయ విద్యార్థినుల జట్టు ఎంపికైంది. జట్టు సభ్యులను శుక్రవారం మున్సిపల్ కార్యాలయం ఆవరణలో మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, కౌన్సిలర్ నాగేంద్ర, పీఈటీలు సుధాకర్, నారాయణ, సుజాత, అఫ్రోజ్, సుధాకర్ తదితరులు అభినందించారు.

తాగునీటి పథకం వద్ద స్టాటర్ చోరీ



స్టాటర్ చోరీ చేసిన దృశ్యం

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని అంకిరెడ్డిపల్లెలో తాగునీటి పథకం కోసం ఏర్పాటు చేసిన స్టాటర్, 20 మీటర్ల విద్యుత్ తీగను శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. రోజు మా దిరిగా వాటర్‌మెన్ నాగరాజు నీటి సరఫరా చేసేందుకు వెళ్లగా స్టాటర్, విద్యుత్ తీగ లేకపోవడంతో సర్పంచ్ నాగన్న దృష్టికి తీసుకెళ్లారు. ఆయన చోరీ విషయాన్ని పోలీస్‌ల దృష్టికి తీసుకెళ్లడంతో వారు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు.

నేటి నుంచి వైఎస్సార్ ఆసరా ఉత్సవాలు

బనగానపల్లె/కోవెలకుంట్ల: బనగానపల్లె నియోజకవర్గంలో శనివారం(3వ తేదీ) నుంచి వైఎస్సార్ ఆసరా 4వ విడత ఉత్సవాలు నిర్వహించనున్నట్లు వైఎస్సార్ క్రాంతిపథం ఏరియా కో ఆర్డినేటర్ గురుస్వామి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం వారు వేర్వేరుగా మాట్లాడుతూ మొదటి రోజు కోవెలకుంట్ల పట్టణ శివారులోని వీఆర్, ఎస్‌ఆర్ ఫంక్షన్ హాలులో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. అదే రోజు మధ్యాహ్నం సంజామల మండలం, మరుసటి రోజు ఆదివారం(ఈనెల 4న) బనగానపల్లె, అవుకు, కొలిమిగుండ్ల మండలాల్లో ఆసరా ఉత్సవాలు కొనసాగుతాయన్నారు. ఆయా మండలాలకు చెందిన పొదుపులక్ష్మి మహిళలు, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వేధింపుల కేసు నమోదు

బేతంచెర్ల: పట్టణంలోని బైటిపేట కాలనీకి చెందిన ఓ మహిళ ఫిర్యాదు మేరకు గోర్లగుట్ట గ్రామానికి చెందిన నరేంద్రనాథ్ రెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు. తనను నరేంద్రనాథ్ రెడ్డి వేధింపులకు గురిచేస్తున్నాడని వివాహిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ శివశంకర్ నాయక్ శుక్రవారం తెలిపారు.

కుష్టువ్యాధిపై అవగాహన

డోన్ టౌన్: కుష్టు వ్యాధిపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని కుష్టువ్యాధి నివారణ అధికారిణి ఫాతిమా సూచించారు. మాదన్ననగర్‌లో శుక్రవారం వ్యాధిపై కాలనీ మహిళలకు అవగాహన కల్పించారు. కాళ్లు తిమ్మిర్లు పట్టడం, చర్మంపై స్పర్శలేని రాగి రంగులో మచ్చలు, కనుబొమ్మలు, రెప్పల వెంట్రుకలు రాలిపోవడం, చర్మం ఉబ్బెత్తుగా, బొడిపెలు ఉండటం, చేతుల నుంచి వస్తువులు జారిపోవడం తదితర లక్షణాలు ఉంటే వైద్యులను సంప్రదించాలన్నారు. సచివాలయం ఏఎన్‌ఎంలు అనురాధ, సుజాత, ఆశా వర్కర్లు కల్పన, లక్ష్మీదేవి, లావణ్య పాల్గొన్నారు.

తొలగిన దారి సమస్య



నేడు: కల్వర్టు నిర్మాణంతో తీరిన సమస్య

బనగానపల్లె: మండలంలోని జిల్లెల్ల -సుబ్బరాయునికొత్తూరు గ్రామాల మధ్య ఉన్న వాగు సమస్య పరిష్కారంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ ఏళ్లుగా ఇబ్బంది పెడుతున్న దారి సమస్యను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పరిష్కరించింది. వాగులో ఏడాదిలో దాదాపు 9 నెలలు 4 నుంచి 5 అడుగుల మేర నీటి ప్రవాహం ఉండేది. దీంతో వాహనాలు, ఎద్దుల బండ్లు రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా ఉండేది. కనీసం వ్యక్తులు కాలి నడకన వెళ్లాలన్నా వీలయ్యేది కాదు. ఇక చిన్నపిల్లలు, వృద్ధుల సంగతి దేవుడెరుగు. సమస్యను గత ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకున్న పాపానపోలేదు. దీంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత జిల్లెల్ల గ్రామ నాయకులు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి కల్వర్టు నిర్మాణానికి రూ.28 లక్షల డీఎంఎఫ్ నిధులను మంజూరు చేయించారు. కల్వర్టు నిర్మాణ పనులు పూర్తికావడంతో రహదారి సమస్య పరిష్కారమైందని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.



నాడు: జిల్లెల్ల- ఎస్ కొత్తూరు గ్రామాల మధ్య వాగు దాటేందుకు ఇబ్బంది పడుతున్న ప్రజలు